## బీసీ సంక్షేమశాఖ కార్యదర్శిగా శ్రీధర్

హైదరాబాద్, నవంబర్15 (నమస్తే తెలంగాణ): బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా నియమితులైన ఈ శ్రీధర్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం స్థానంలో ప్రభుత్వం శ్రీధర్‌ను ఇటీవలే నియమించింది. సెక్రటరీ శ్రీధర్‌ను మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులాల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు, బీసీ సంక్షేమశాఖ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు.

## ఎక్సైజ్ డైరెక్టర్‌గా హరికిరణ్ బాధ్యతలు

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్‌గా చెవ్వూరు హరికిరణ్ శుక్రవారం ఆబ్కారీ భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సెక్రటేరియట్‌లోని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును మర్యాద పూర్వకంగా కలిశారు. అడిషనల్ డైరెక్టర్ అజయ్‌రావు, జాయింట్ కమిషనర్లు ఖురేషి, కేఏబీ శాస్త్రి, సురేశ్, జాయింట్ కమిషనర్ శశిధర్‌రెడ్డి, బేవరేస్ కార్పొరేషన్ జీఎంలు అబ్రహం, కాశీనాథ్, డిప్యూటీ కమిషనర్ దశరథ్, డీసీ హెడ్ క్వార్టర్స్ రఘురాం, అసిస్టెంట్ కమిషనర్లు చంద్రయ్య, శీలం శ్రీనివాస్, అనికుమార్‌రెడ్డి, ఆర్ కిషన్, ప్రవీణ, శ్రీధర్, ఎస్‌టీఎఫ్ ప్రదీప్‌రావు, ఏఈఎస్‌లు శ్రీనివాసరావు, జీవన్‌కిరణ్, పీఏలు జాఫర్, రమేశ్ నూతన డైరెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. 2009 ఐఏఎస్ ఏపీ నంబర్ వన్ ర్యాంకర్‌గానూ, ఆల్ ఇండియాలో 18వ ర్యాంకర్‌గా హరికిరణ్ గుర్తింపు పొందారు. శిక్షణ అనంతరం వైఎస్సార్ కడప, ఈస్ట్‌గోదావరి కలెక్టర్‌గా, అగ్రికల్చర్ స్పెషల్ కమిషనర్‌గా పనిచేశారు.

## టూరిజం ప్రమోషన్‌కు త్వరలో కమిటీ

**మంత్రి జూపల్లి కృష్ణారావు**

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ టూరిజం ప్రమోషన్‌కు త్వరలో కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో నిర్వహించిన ట్రావెర్నియా ఫెస్ట్‌కు ఆయన హాజరై మాట్లాడుతూ దేశ, విదేశాల నుంచి వచ్చే పర్యాటకులు ఇక్కడి పర్యాటక, చారిత్రక ప్రాంతాలను సందర్శించే విధంగా టూరిజం ప్రమోషన్ అవసరమని చెప్పారు. కార్యాచరణ రూపొందిస్తున్నామని, త్వరలోనే ఓ కమిటీని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

## ఇంట్లో దోషం ఉందంటూ బురిడీ

- **55 లక్షలు కాజేసిన ట్రాన్స్‌జెండర్**
- **జనగామ ఠాణాలో బాధితుల ఫిర్యాదు**

జనగామ చౌరస్తా, నవంబర్ 15: ఇంట్లో ఉన్న దోషం పోగొడతానని నమ్మించిన ఓ ట్రాన్స్‌జెండర్ 55 లక్షలకు బురిడీ కొట్టించిన ఉదంతం జనగామలో శుక్రవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వెంకన్నకుంటకు చెందిన సిరివెన్నెలతోపాటు హైదరాబాద్‌లో ఉంటున్న ఆమె సోదరుడు నిఖిల్ ఇంట్లో ఉన్న దోషం పోగొట్టడానికి నష్టనివారణ పూజలు చేస్తానని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సత్యనారాయణపురానికి చెందిన ట్రాన్స్‌జెండర్ నాగదేవి వీరిని నమ్మించింది. జూలై నెల నుంచి బాధితులిద్దరి ఇళ్లల్లో దోష నివారణ పూజలు చేసింది. వీరిద్దరి నుంచి 55 లక్షల వరకు వసూలు చేసింది. దోష నివారణ పూజలు జరిగి ఐదు నెలలు గడుస్తున్నా, వారికి ఎలాంటి మంచి జరగకపోవడంతో అనుమానం వచ్చి నాగదేవిని బాధితులు ఫోన్‌లో ప్రశ్నించించారు. 13న జనగామకు వచ్చిన నాగదేవిని బాధితులిద్దరు నిలదీయడంతోపాటు తమ వద్ద తీసుకున్న రూ.55 లక్షలను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆమె ఒప్పుకోకపోవడంతో మోసపోయామని గ్రహించి జనగామ అర్బన్ పోలీసులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపుతా:ట్రంప్

వాషింగ్టన్ : రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపడంపై తన ప్రభుత్వం దృష్టి పెడుతుందని అమెరికా ప్రెసిడెంట్ ఎలక్ట్ డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఈ యుద్ధంలో వేలాది మంది ప్రాణాలు కోల్పోతుండటంపై ఆవేదన వ్యక్తం చేశారు. తన మర్-ఏ-లగో ఎస్టేట్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ, మిడిల్ ఈస్ట్‌లో ప్రశాంతత కోసం కృషి చేస్తామని చెప్పారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు కృషి చేస్తామన్నారు. మూడు రోజుల్లో వేలాది మంది మరణించారని ఓ నివేదిక పేర్కొందని చెప్పారు.

# మందులివ్వకుండా.. డాక్టర్లపై నెపమా?

- **ముఖ్యమంత్రి రేవంత్ వద్దనే పెండింగ్‌లో పెరిఫెరల్ ఫైల్**
- **పరిష్కరించకుండానే హడావుడిగా డాక్టర్ల బదిలీలు**
- **వద్దన్నా బలవంతపు పదోన్నతులు**
- **కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న ప్రభుత్వ వైద్యులు**
- **త్వరలో సమ్మె నోటీసు ఇవ్వనున్నట్టు వెల్లడి**



హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): 'ఆధునిక సౌకర్యాల మాట దేవుడెరుగు.. కొన్ని రోజులుగా 2వ, 3వ క్వార్టర్ మందులే ఇంకా విడుదల కాలేదు.. కానీ పత్రికల్లో వచ్చే వార్తలకు వైద్యులు, వైద్యాధికారులు వివరణ ఇవ్వాలా.. ఇదెక్కడి న్యాయం' అంటూ తెలంగాణ ప్రభుత్వ వైద్యులు కాంగ్రెస్ సర్కార్‌పై మండిపడుతున్నారు. సామర్థ్యానికి మించి పనిచేస్తున్నా.. బయోమెట్రిక్‌లు, రోజువారి రిజిస్టర్‌లు అంటూ తమను మానసికంగా ఇబ్బందులు పెట్టడం సరికాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారితోషికానికి సంబంధించిన పెరిఫెరల్ ఫైల్‌ను సీఎం ఏడు నెలలుగా తన వద్దనే పెండింగ్‌లో ఉంచుకొని, అది అమలు చేయకుండానే వైద్యులను హడావుడిగా జిల్లాలకు బదిలీ చేయడంపై మండిపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి సదుపాయాలు కల్పించకుండా, బలవంతంగా అక్కడికి పంపి మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తరువాత సాధారణ సెలవులు ఇవ్వకపోగా ఈఎల్స్ కూడా ఇవ్వకుండా శ్రమ దోపిడీ చేస్తూ తమను వేధిస్తున్నారని వాపోతున్నారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే త్వరలోనే సమ్మె నోటీసు ఇస్తామంటూ వైద్యులు హెచ్చరిస్తున్నారు.

### పనిగంటలు పెరిగినా.. మెరుగవ్వని పారితోషికం

ప్రస్తుతం కాంగ్రెస్ హయాంలో దవాఖానల్లో సిబ్బంది కొరతతోపాటు కనీస వసతులు లేవని, మందులు అందుబాటులో ఉండడం లేదని వైద్యులు చెబుతున్నారు. రాష్ట్రంలోని చాలా వైద్య కళాశాలల్లో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టులు తక్కువగా ఉన్నాయని, దీంతో నలుగురు చేయాల్సిన పని ఒకరిద్దరే చేయాల్సిన పరిస్థితి ఉన్నట్టు వాపోతున్నారు. దీంతో వైద్యులకు పనిగంటలు పెరుగుతున్నాయని, ఎక్కువ డ్యూటీలు చేయాల్సి వస్తున్నదని, అయినా పారితోషికం మాత్రం పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా వైద్యులకు పదోన్నతులు వచ్చినప్పుడు ఏదైనా కారణంతో వద్దనుకుంటే మొదటి సారి వదిలేస్తారు.. రెండోసారి మాత్రం తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. అది కూడా వారు కోరుకున్న ఆప్షన్స్‌లో ఏదో ఒక చోట పోస్టింగ్ ఇస్తారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో తొలిసారిగా వచ్చిన పదోన్నతిని తిరస్కరించినా బలవంతంగా ఇస్తున్నారని, కనీసం ఆప్షన్ కూడా అడగకుండా ఎక్కడపడితే అక్కడ పోస్టింగ్ ఇస్తున్నట్టు వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఏడు నెలలుగా సీఎం వద్దనే ఫైల్

అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్న నగరంలో పనిచేసే వైద్యులకు 40శాతం అధిక పారితోషికాలు ఉండడం, సరైన సదుపాయాలు లేని మారుమూల గ్రామాల్లో పనిచేసే వారికి తక్కువ జీతాలు ఉండడంతో చాలా మంది వైద్యులు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసేందుకు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో ఉన్నతాధికారులు ట్రైబల్ ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు 50శాతం, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వారికి హైదరాబాద్‌లో పనిచేసే వారితో సమానంగా వేతనాలు చెల్లించేలా ప్రతిపాదనలు రూపొందించింది. దీనికి సంబంధించిన 5096-ఏ-2024 నంబర్ గల పెరిఫెరల్ ఫైల్ మే నెలలో సీఎం కార్యాలయానికి ఉన్నతాధికారులు పంపించారు. అప్పటి నుంచి ఏడు నెలలుగా ఆ ఫైల్ ముఖ్యమంత్రి వద్దనే పెండింగ్‌లో ఉంది. కానీ ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఉస్మానియా, గాంధీ తదితర దవాఖానల నుంచి కరీంనగర్, జగిత్యాల, ఆసిఫాబాద్ వంటి జిల్లాలకు తమను బదిలీ చేశారని పలువురు వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా హడావుడిగా బదిలీలు చేయడంపై బాధిత వైద్యాధికారులు మండిపడుతున్నారు.

### హెల్త్ సెక్రటరీ అంటేనే హడల్

వైద్య, ఆరోగ్యశాఖలో హెల్త్ సెక్రటరీ అంటేనే హడల్. కనీసం తమ సమస్యలు వినేందుకు కూడా హెల్త్ సెక్రటరీ ఇష్టపడరని, ఏదైనా సమస్యను విన్నవించేందుకు వెళ్తే గంటల తరబడి నిరీక్షించాల్సి ఉంటుందని వైద్యులు ఆరోపిస్తున్నారు. ఇక డీఎంఈ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదని డాక్టర్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలు పరిష్కరించకుండా ఇలానే మానసిక ఒత్తిడికి గురిచేస్తే త్వరలోనే సమ్మె నోటీసు ఇస్తామంటూ వైద్యులు హెచ్చరిస్తున్నారు. పెరిఫెరల్ ఫైల్‌ను వెంటనే పరిష్కరించి ట్రైబల్, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు పారితోషికాన్ని పెంచేలా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## 'పది' ఫీజు గడువును పొడగించండి

**ప్రభుత్వానికి జీహెచ్‌ఎంఏ విజ్ఞప్తి**

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపు గడువును 30 వరకు పొడగించాలని తెలంగాణ స్టేట్ గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ (టీఎస్ జీహెచ్‌ఎంఏ) కోరింది. శుక్రవారం ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావును కలిసి వినతిపత్రాన్ని సమర్పించింది. ఫీజు చెల్లింపు విషయంలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఫీజు చెల్లింపు గడువును పొడగించాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజభాను చంద్రప్రకాశ్, ప్రధాన కార్యదర్శి రాజగంగారెడ్డి కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఫీజు మినహాయింపు ఇవ్వాలని, 33 జిల్లాల్లో మూల్యాంకన కేంద్రాలను ఏర్పాటు చేయాలని విన్నవించారు.

## టీచర్ల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

**నాలుగు డీఏలను విడుదల చేయాలి: పీఆర్టీయూ**



మాట్లాడుతున్న పింగిలి శ్రీపాల్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీచర్ల జీపీఎఫ్, మెడికల్, సరెండర్ లీవు, టీఎస్‌జీఎల్‌ఐ సహా రిటైర్మెంట్ ప్రయోజనాల బిల్లులు ఏడాదిన్నరగా పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో టీచర్లు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సంఘం 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శుల సమావేశాన్ని శుక్రవారం నారాయణగూడలోని కార్యాలయంలో నిర్వహించారు. కాంగ్రెస్ తమ మ్యానిఫెస్టోలో ప్రకటించినట్టు సీపీఎస్‌ను రద్దుచేయాలని, బకాయిపడ్డ నాలుగు డీఏలను విడుదల చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, కరీంనగర్ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు పేరి వెంకట్‌రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్ పాల్గొన్నారు.

## ధాన్యాన్ని ఎక్కడైనా అమ్ముకోవచ్చు

మొదటిపేజీ తరువాయి...

ఇస్తున్నట్టు తెలిపారు. రూ.2 లక్షల లోపు రుణాలు మాఫీ చేశామని, అంతకంటే ఎక్కువ ఉన్న వారికి కూడా త్వరలోనే మాఫీ చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. పత్తి దిగుబడి తగ్గినా కొనుగోలులో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. వచ్చే జనవరి నుంచి రేషన్ ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వెల్లడించారు.

## కేటీఆర్ అరెస్టుకు కాంగ్రెస్ కుట్ర చేయట్లే

**ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు**



హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను అరెస్టు చేసేందుకు కాంగ్రెస్ ఎలాంటి కుట్ర చేయట్లేదని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులే అధికారులపై దాడి గురించి స్వయంగా మాట్లాడారని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో మంత్రి మాట్లాడారు. కేటీఆర్ సంగారెడ్డి పర్యటనపై స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు.. అధికారులను తరిమికొడతామంటూ మాట్లాడిన వీడియోలు సర్క్యులేట్ అవుతున్నాయని తెలిపారు. కలెక్టర్, గ్రూప్-1 ఆఫీసర్‌పై దాడిచేసి వారిని చంపే ప్రయత్నం చేశారని ఆరోపించారు. పరిశ్రమలు రాష్ట్ర ప్రగతికి దోహదపడతాయని, వాటిని నెలకొల్పే ప్రయత్నాలు కొనసాగుతాయని మంత్రి స్పష్టంచేశారు. వరిలో 17 శాతం తేమ నిబంధనలు కేంద్రం పెట్టిందని, ఆ నిబంధనల్లో సవరణలు చేసేలా బీజేపీ నాయకులు ఒప్పించాలని మంత్రి శ్రీధర్ బాబు ఆ పార్టీ నాయకులకు సూచించారు. ప్రభుత్వం ధాన్యానికి బోనస్ ఇవ్వడం లేదని బీఆర్‌ఎస్ నాయకులు రైతులను రెచ్చగొడుతున్నారని, బోనస్ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు.

## సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఫిర్యాదు బాక్స్‌లు ఏర్పాటు చేయాలి

- **రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం**

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కారాలయాల్లో ఫిర్యాదులు, వినతుల స్వీకరణ కోసం ప్రత్యేకంగా బాక్సులను ఏర్పాటు చేయాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, రిజిస్ట్రేషన్ ప్రక్రియను క్రమబద్ధీకరించాలని పేర్కొంటూ గతంలో జారీచేసిన మార్గదర్శకాలను అమలు చేయాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్‌కు స్పష్టం చేసింది. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికాలకు సూచించింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్‌లోని ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేయకపోవడాన్ని సవాలు చేస్తూ కేపీహెచ్‌బీకి చెందిన పీ రమ్యశ్రీ మరొకరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్ కుమార్ ఇటీవల ఈ ఆదేశాలు జారీ చేశారు. ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం రూ.2 లక్షలు డిమాండ్ చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న రంగారెడ్డి జిల్లా జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1 కార్యాలయ సిబ్బందిపై విచారణ జరిపి, చట్టప్రకారం చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం తాజాగా దరఖాస్తు చేసుకోవాలని పిటిషనర్‌ను, దాన్ని పరిశీలించి వారంలోగా తగిన ఉత్తర్వులు జారీచేయాలని జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1ను ఆదేశిస్తూ.. తదుపరి విచారణను డిసెంబర్ 10కి వాయిదా వేశారు.

## మహిళా సంఘాలకు సోలార్‌ప్లాంట్లు

- **వెయ్యి మెగావాట్ల విద్యుదుత్పత్తి బాధ్యతలు**
- **స్థల సేకరణ, రుణాలందించడంలో రాష్ట్ర ప్రభుత్వం చేయూత**
- **అధికారులను ఆదేశించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు సోలార్‌ప్లాంట్లు ఏర్పాటుచేసే అవకాశమివ్వనున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్లాంట్ల ఏర్పాటుకు స్థలసేకరణ, రుణాలందించడంలో వారికి చేయూతనందించాలని అధికారులను ఆదేశించారు. పీఎం కుసుమ్ పథకంలో భాగంగా 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు ఇటీవలే ప్రభుత్వం అనుమతిచ్చింది. ఇందులో వెయ్యి మెగావాట్ల ప్లాంట్లను మహిళా సంఘాలకు అప్పగించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క కోరారు. ఇందుకు అవసరమయ్యే స్థలాన్ని లీజుకు ఇప్పిస్తామని తెలిపారు. ఆ శాఖ అధికారులు ఇంధనశాఖకు ప్రతిపాదనలు సమర్పించారు. దీంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విద్యుత్తుశాఖ అధికారులు, బ్యాంకర్లతో సమీక్షించి రుణాలు ఇప్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఇంధనశాఖ సెక్రటరీ సందీప్ సుల్తానియా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శి లోకేశ్, సెర్ప్ సీఈవో దివ్యాదేవరాజన్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, రెడ్ వీసీ ఎండీ అనీల పాల్గొన్నారు.

## అమాత్యులకో న్యాయం.. మిగతా వారికో న్యాయం

- **జూనియర్ కాలేజీల పోస్టుల మంజూరులో ప్రభుత్వం వివక్ష**
- **సీఎం సహా మంత్రుల నియోజకవర్గాలకే పెద్దపీట**
- **మిగతా నియోజకవర్గాలపై సవతితల్లి ప్రేమ**

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ సర్కారు.. పూర్తి పక్షపాత వైఖరిని ప్రదర్శిస్తున్నది. తమ వారికో న్యాయం.. మిగతా వారికో న్యాయం అన్నట్టుగా వ్యవహరిస్తున్నది. ఇందుకు ఇంటర్ కొత్త కాలేజీలు, సొంతభవనాలు, పోస్టుల మంజూరియే సాక్ష్యంగా నిలుస్తున్నది. ఈ విషయంలో సీఎం సహా మంత్రుల నియోజకవర్గాలకే పెద్దపీట వేస్తున్నారు. మిగతా నియోజకవర్గాలు, ప్రాంతాలపై సవతితల్లి ప్రేమను చూపిస్తున్నారు. సీఎం సొంత నియోజకవర్గమైన కొడంగల్ పరిధి హకీంపేటలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీకి 20 టీచింగ్, 11 నాన్ టీచింగ్ పోస్టులను ఇటీవలే మంజూరుచేశారు. తాజాగా కొత్తపల్లికి జూనియర్ కాలేజీ మంజూరుచేయడంతోపాటు బొంరాస్‌పేట, దౌల్తాబాద్ కాలేజీలకు ఒక్కో కాలేజీకి 15 బోధన, బోధనేతర పోస్టులు, సొంతభవనాల నిర్మాణాలకు రూ. 7కోట్లు నిధులిచ్చారు. మంత్రి తుమ్మల సిఫారసుతో కూసుమంచి మండలంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీకి పోస్టులు మంజూరయ్యాయి.

### పెండింగ్‌లో ప్రతిపాదనలు..

సర్కారు స్కూళ్లల్లో శానిటైజేషన్ సమస్యలు తీర్చేందుకు ఇటీవలే ప్రభుత్వం మెయింటెనెన్స్ వర్కర్లను నియమించుకునేందుకు అనుమతినిచ్చింది. సింగరేణి సంస్థకు చెందిన నిధులతో ఈ వర్కర్లకు వేతనాలిస్తున్నారు. రాష్ట్రంలోని 428 కాలేజీల్లో స్వీపర్, వాచ్‌మెన్, శానిటైజేషన్ వర్కర్ తదితర 1,200 పోస్టులను మంజూరుచేయాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. కానీ సీఎం రేవంత్, మంత్రి తుమ్మల నియోజకవర్గాల్లోని కాలేజీలకు మాత్రం ఆగమేఘాల మీద పోస్టులు మంజూరయ్యాయి. విచిత్రమేంటంటే రాష్ట్రంలో ఏ ప్రభుత్వ కాలేజీకి వాచ్‌మెన్, స్వీపర్, శానిటైజేషన్ పోస్టులను మంజూరు చేయలేదు. ఇలా మిగతా కాలేజీలపై పూర్తిగా పక్షపాత ధోరణితో వ్యవహరించడంపై పలువురు మండిపడుతున్నారు.

### సమస్యల సుడిగుండంలో..

రాష్ట్రంలోని 428 ప్రభుత్వ జూనియర్ కాలేజీలుంటే.. వీటిలో 398 కాలేజీలకు మాత్రమే సొంత భవనాలున్నాయి. మరో 24 కాలేజీలకు సొంతభవనాలు లేక సమీపంలోని సర్కారీ స్కూళ్లల్లో నడుస్తున్నాయి. 18 ప్రభుత్వ కాలేజీలు శిథిలభవనాల్లో నడుస్తున్నాయి. 227 కాలేజీలకు ప్రహరీలే లేవు. 86 కాలేజీల్లో ఆర్వోప్లాంట్లు లేవు. ఇలా సర్కారు కాలేజీలు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపని ప్రభుత్వం పూర్తిగా వివక్షపూరితంగా వ్యవహరిస్తున్నది.

### కొత్త కాలేజీలకు పోస్టులేవీ..

కొత్తగా 25 కొత్త ప్రభుత్వ జూనియర్ కాలేజీలు మంజూరయ్యాయి. వీటిలో కొన్ని కాలేజీలకు ఒక్కటంటే ఒక్క పోస్టు కూడా మంజూరుచేయలేదు. ఈ కాలేజీల్లో క్లాసులు తీసుకునే వారు లేకపోవడంతో విద్యార్థులు అడ్మిషన్లను రద్దుచేసుకుని ఇతర కాలేజీల్లో చేరుతున్నారు. దీంతో ఇతర కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకులను తాత్కాలికంగా డిప్యూటేషన్‌పై పంపించి మమ అనిపించేస్తున్నారు.

## ఏఐసీసీలో ఖర్గే ఒక బొమ్మ

**ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి**

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): ఏఐసీసీలో మల్లికార్జున ఖర్గే ఒక బొమ్మ మాత్రమేనని బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గతంలో మన్మోహన్ సింగ్‌ను వాడుకున్నట్టే నేడు ఖర్గేను వాడుకుంటున్నారని ఆరోపించారు. శుక్రవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 1995లో కాంగ్రెస్ తెచ్చిన వక్ఫ్ బోర్డు చట్టంతో సుప్రీం తీర్పునకు మించి అధికారాలు ఇచ్చారని విమర్శించారు. శీతాకాల సమావేశాల్లో పార్లమెంట్‌లో వక్ఫ్ బోర్డు బిల్లు పాస్ అవడం ఖాయమన్నారు. మూసీ నిద్రలో భాగంగా శనివారం సాయంత్రం 4 నుంచి ఆదివారం ఉదయం 9 వరకు బస్తీలో గడపనున్నట్టు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు చెప్పారు.

# ప్రతిపక్షాన్ని ఎదుర్కోలేరా?

- **కాంగ్రెస్ మీద కేటీఆర్, హరీశ్ దండయాత్ర చేస్తున్నారు**
- **నలుగురు తప్ప మిగిలిన బడా నేతలు మాట్లాడరెందుకు?**
- **మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి రేవంత్ అసహనం**



హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): కేటీఆర్, హరీశ్‌రావు తమ మీద విమర్శలు కాదు.. దండయాత్ర చేస్తున్నా.. బడా నేతలంతా మాకెందుకులే, మమ్మల్ని కాదు కదా అన్నట్టు సైలెంట్‌గా ఉంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి వాపోయినట్టు విశ్వసనీయంగా తెలిసింది. 'నా కంటే మీకు మంచి సీఎం దొరకడు' అంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేసినట్టు సమాచారం. ప్రజా పాలన- ప్రజా విజయోత్సవ వేడుకల సమీక్షల అనంతరం సీఎం కొంతమంది మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి కొద్దిసేపు మాట్లాడినట్టు తెలిసింది. ఢిల్లీ టూర్, మహారాష్ట్ర ఎన్నికల ప్రచార అంశాలు వారి మధ్య చర్చకు వచ్చినట్టు సమాచారం. అనంతరం లగచర్ల ఘటన, కుల గణన, సోషల్ మీడియా ప్రస్తావనకు రాగా.. తెలంగాణలో రాబోయే కుల గణన ఫలితాల మీద రాహుల్‌గాంధీ చాలా ఆసక్తిగా ఉన్నారని చెప్తూ.. 'మనం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణనపై ప్రతిపక్షాలు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నప్పటికీ ఇటు పార్టీపరంగా గానీ, అటు సోషల్ మీడియా పరంగా గానీ దీటుగా ఎదుర్కోలేకపోతున్నాం' అని సీఎం ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది. కేవలం పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అప్పుడప్పుడు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్ తప్ప మిగతా మంత్రులు ఎవరూ మాట్లాడటం లేదని, ఎంపీలు, ఎమ్మెల్యేలు అసలే స్పందించడం లేదంటూ సీఎం ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం.

### లోకల్‌బాడీ ఎలక్షన్స్‌లో నష్టం తప్పదు

కేటీఆర్, హరీశ్‌రావు సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేస్తున్నారని, వాటిని కాంగ్రెస్ నాయకులు తిప్పికొట్టే ప్రయత్నమే చేయటం లేదని సీఎం రేవంత్ అసంతృప్తి వ్యక్తంచేసినట్టు తెలిసింది. రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేసినా.. రైతుల నుంచి ఆశించిన స్థాయిలో మైలేజీ రాలేదని పేర్కొన్నారు. పార్టీ నాయకులు మౌనంగా ఉన్నారని, ప్రతిపక్షాల ఆరోపణలు, విమర్శలను సమర్థంగా ఎదుర్కొని కౌంటర్ ఇవ్వడం లేదని ఘాటుగానే మాట్లాడినట్టు తెలిసింది. వారి మౌనానికి కారణం ఏమిటని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను అడిగినట్టు సమాచారం. ఇది ఇట్లానే కొనసాగితే త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలతోపాటు లోకల్‌బాడీ ఎన్నికల్లో పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించినట్టు సమాచారం.

# జనవరిలో అమెరికాకు సీఎం రేవంత్‌రెడ్డి!

- **ఐదు నెలలకే మరోసారి యూఎస్ పర్యటన**
- **ఇప్పటికే ఐదు దేశాల్లో పర్యటించిన ముఖ్యమంత్రి**

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చే జనవరిలో అమెరికా పర్యటనకు వెళ్లనున్నట్టు తెలిసింది. షెడ్యూల్ సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. ఈ ఏడాది ఆగస్టు 3 నుంచి 12 వరకు సీఎం అమెరికాలో పర్యటించారు. ఇప్పుడు ఐదు నెలలకే మరోసారి అమెరికా వెళ్తుండటం గమనార్హం. గతంలో మాదిరిగానే 'రాష్ట్రానికి పెట్టుబడులు సాధించడమే లక్ష్యం' అనే ట్యాగ్ లైన్‌తో ఈ పర్యటన ఉంటుందని చెప్తున్నారు. మరోవైపు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక-2025 (డబ్ల్యూఈఎఫ్) సదస్సు జనవరి 20న ప్రారంభం కానున్నది. సీఎం అమెరికా పర్యటన ముగించుకొని నేరుగా ఈ సదస్సుకు వెళ్తారన్న చర్చ జరుగుతున్నది. అయితే దావోస్ సదస్సుకు రేవంత్ హాజరవుతారా లేదా అనేది ఇంకా స్పష్టం కాలేదు. సీఎం అమెరికా పర్యటన నేపథ్యంలో డిసెంబర్‌లోనే అసెంబ్లీ సమావేశాలు పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది. చివరగా ఈ ఏడాది జూలై 23 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరిగాయి. ఆరు నెలల్లోగా కచ్చితంగా సమావేశాలు నిర్వహించాలన్న గడువు ఉంది.

### 9 నెలల్లో ఐదు దేశాల్లో పర్యటన

అధికారంలోకి వచ్చిన మొదటి 9 నెలల్లోనే సీఎం ఐదు దేశాల్లో పర్యటించారు. మొదటిసారి 3 దేశాలు, రెండో పర్యటనలో 2 దేశాల్లో పర్యటించారు. మొదట జనవరి 15నుంచి 18 వరకు దావోస్‌లో జరిగిన డబ్ల్యూఈఎఫ్ సదస్సులో పాల్గొన్నారు. ఆ తర్వాత బ్రిటన్ వెళ్లారు. రెండు రోజులపాటు లండన్‌లో పర్యటించారు. ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీతో కలిసి లండన్ షార్ట్‌ను సందర్శించారు. అక్కడి నుంచి 21న దుబాయ్‌కి చేరుకున్నారు. రెండు రోజుల అనంతరం తిరిగి హైదరాబాద్ వచ్చారు. ఆగస్టులో రెండో విడత విదేశీ పర్యటనలో 3వ తేదీ నుంచి 14వ తేదీ వరకు అమెరికా, దక్షిణ కొరియా వెళ్లారు. ఇలా ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపే ఐదు దేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. ఇప్పుడు మూడో విడత విదేశీ పర్యటనకు శ్రీకారం చుట్టనున్నారు.

# *గాడిద పాలతో 100కోట్ల మోసం*

- ***తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్నాటకలో భారీ స్కామ్***
- ***గాడిదలు సరఫరా చేసి, పాలు కొంటామని నయా దందా***
- ***అధిక లాభాలు ఆశచూపి మాయలో పడేసిన మోసగాళ్లు***
- ***లక్షలు పోగొట్టుకుని లబోదిబోమంటున్న బాధితులు***
- ***ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన***

*ఖైరతాబాద్, నవంబర్ 15(నమస్తే తెలంగాణ): "మీకు గాడిదలను మేమే అమ్ముతాం.. వాటి పాలను మేమే కొంటాం" అంటూ ఓ కొత్త తరహా మోసానికి పాల్పడింది.. తమిళనాడు తిరునల్వేలికి చెందిన డాంకీ ప్యాలెస్ సంస్థ. గాడిదలను లక్షలకు విక్రయించి, పాలను కొనకుండా మొహం చాటేసింది. గాడిద పాలు అమ్ముతూ లక్షలు సంపాదించవచ్చని చెబుతూ వందల మంది రైతులు, చిరుద్యోగులు, మధ్యతరగతి ప్రజల్ని నిండా ముంచింది. తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి 400 మంది నుంచి రూ.5.50 చొప్పున వసూలు చేసిన ముఠా వ్యవహారం ఏడాదికాలంగా పరిష్కారం కావడం లేదు. తెలంగాణ, ఏపీలోనే రూ.100 కోట్ల స్కామ్ జరిగిందని బాధితులు చెబుతున్నారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం తమ గోడు వెల్లడించారు. డాంకీ ప్యాలెస్ సంస్థ నిర్వాహకులను నిలదీస్తే చెల్లని చెక్కులు ఇచ్చారని ఆవేదన వ్యక్తంచేశారు. లాభాలు ఆర్జించవచ్చని ఆశపడ్డామని, ఇంత మోసం జరుగుతుందని ఊహించలేదంటూ వాపోయారు. ఇప్పటికే ఈ వ్యవహారంపై కేటీఆర్ ఎక్స్‌లో స్పందించారు. బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.*

### *లాభాల ఆశతో లక్షలు పోగొట్టుకున్నాం*

*గాడిదల పాల వల్ల లక్షలు సంపాదించవచ్చన్న ప్రకటనలు చూసి మోసపోయాం. ఇండ్లు, జాగా అమ్ముకొని రూ.60లక్షల నుంచి రూ.70లక్షల వరకు పెట్టుబడులు పెట్టి చేతులు కాల్చుకున్నాం.*

*-రమాదేవి, డాంకీ ప్యాలెస్ బాధితురాలు, మాచర్ల*

### *ప్రభుత్వాలు ఆదుకోవాలి*

*గాడిద పాల వ్యాపారం కోసం తాము రూ.65లక్షల పెట్టుబడి పెట్టి మోసపోయాం. తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్నాటక ముఖ్యమంత్రులు స్పందించి మాకు న్యాయం జరిగేలా చూడాలి.*

*- తేజస్విని, డాంకీ ప్యాలెస్ బాధితురాలు, అనంతపురం*



*సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సాయిబాబా*

## *మాయమాటలు నమ్మి మోసపోయాం*

*"నేను బెంగళూరులో ప్రైవేట్ ఉద్యోగం చేసేవాణ్ని. గాడిద పాలతో లక్షలు గడించవచ్చని డాంకీ ప్యాలెస్ సంస్థ యూట్యూబ్ చానళ్లలో విపరీతమైన ప్రచారం చేసింది. . ఒక్కో గాడిదకు రూ.80వేల నుంచి 1.5 లక్షలు ఉంటుందని, లీటర్ పాలకు 1,600 నుంచి రూ.1,800 వరకు చెల్లిస్తామని చెప్పారు. ఒక్కొక్కరి నుంచి రూ.5.50లక్షల చొప్పున వసూలు చేశారు. రూ.15వేలు నుంచి రూ.20వేల విలువైన గాడిదలను రూ.90వేలకు విక్రయించారు. అవి హలారే జాతికి చెందిన గాడిదలు అని అన్నారు. డాంకీ ప్యాలెస్ నిర్వాహకుల మాటలు నమ్మి లక్షలు పోసి గాడిదలను కొనుక్కున్న వాళ్లం మరింత ఖర్చుపెట్టి వ్యవసాయభూముల్లో ఫామ్‌లు కట్టుకున్నాం. మొత్తం నష్టపోయాం."*

*- సాయిబాబా, బాధితుడు, బెంగళూరు*